మున్నూరు కాపులందరికీ సహకరిస్తా..

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఫిబ్రవరి 18 : మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చెప్పారు. జిల్లాకేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. మున్నూరు కాపు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. అనంతరం కార్యవర్గాన్ని ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు రాష్ట్రనాయకులతో పాటు ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణ, పీఏసీసీఎస్ చైర్మన్ వెంకటేశ్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి విరాళం

విరాళాన్ని అందజేస్తున్న జెడ్పీవైస్ చైర్మన్, సీడీసీ చైర్మన్

కొత్తకోట, ఫిబ్రవరి18 : కొత్తకోట పట్టణ సమీపంలోని ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్న శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి లక్ష విరాళాన్ని అందించగా ఆయన తరపున ఆదివారం జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో జగన్మోహన్‌రెడ్డి, ఆకుల శ్రీను, భీంరెడ్డి, వడ్డె శ్రీనివాసులు, సంధ్యారవీందర్‌రెడ్డి, అద్వాని శ్రీను, గోవింద్‌నాయుడు, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, హరిసింగ్, శివ తదితరులు పాల్గొన్నారు.

'ఇష్టపడి చదివితేనే ఉత్తమంగా రాణిస్తారు'

విద్యార్థులకు సూచనలు చేస్తున్న ప్రముఖ మోటివేషన్ స్పీకర్ ఎస్. గమనం

ఆత్మకూరు, ఫిబ్రవరి 18 : విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉత్తమంగా రాణిస్తారని ప్రముఖ మోటివేషన్ స్పీకర్ ఎస్. గమనం అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీవాణి ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరీక్షల సందర్భంగా ఎలాంటి ఒత్తిడికి గురికావాల్సిన పనిలేదన్నారు. నిత్యం పాఠశాలలో నిర్వహించే పరీక్షల్లో ఎంత ఉత్సాహంగా పాల్గొంటామో అదేమాదిరి హాజరుకావాలన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ విశ్వేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర్, ఉపాధ్యాయులు లత, శ్రీమాలి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వృథాగా 'భగీరథ' నీరు

- పట్టించుకోని అధికారులు

ఎద్దులగూడెంలో పైపులైన్ పగిలి పోవడంతో వృథాగా పారుతున్న మిషన్ భగీరథ నీరు

మల్దకల్, ఫిబ్రవరి 18 : మండలకేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరిగ్గా రాక ప్రజలు అల్లాడుతున్నారు. అయితే మండలంలోని ఎద్దులగూడెం గ్రామంలో వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యే పైపు లైన్ పగిలి నీరంతా వృథాగా పారుతుంది. దీంతో గ్రామంలోని వాటర్ ట్యాంక్‌కు నీరు ఎక్కకపోవడంతో నీరు రాక ప్రజలు అల్లాడి పోతున్నారు. ఈ రోడ్డు వెంబడి నిత్యం వివిధ శాఖల అధికారులు తిరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవరించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచులు ఇలాంటి సమస్యలను వెంటనే పరిష్కరించేవారని కానీ ప్రస్తుతం స్పెషల్ అధికారి గ్రామం వైపునకు చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు సమస్యలను పట్టించుకొని ప్రజలకు తాగునీరు అందే విధంగా కృషి చేయాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ఉద్యోగులు, కార్మికులు పని చేసే సిబ్బంది కోసం దయచేసి మమ్మల్ని సంప్రదించండి **సురక్షిత అసోసియేట్ మ్యాన్‌పవర్ సర్వీసెస్** న్యూటౌన్ మహబూబ్‌నగర్. అందుబాటులో ఉన్న వర్గాలు. కంప్యూటర్ ఆపరేటర్లు క్యాషర్లు, సేల్స్ మ్యాన్, రిసిప్షన్లు, ఆఫీస్ బాయ్స్, ఆఫీస్ స్టాఫ్, నర్సులు, డ్రైవర్లు మరియు మొదలైనవి. సంప్ర **8142193223, 9573960205.**
NT-MBNR

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319440-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

కదులుతున్న ముసలం

- పత్తివిత్తనాల ఆర్గనైజర్లు వేసిన పిటిషన్‌ను తిరస్కరించిన హైకోర్టు
- అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని కోర్టు ఆదేశాలు

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 18 : జిల్లాలో పత్తి విత్తనాల గోల్‌మాల్ వ్యవహారం రోజురోజుకూ సంచలనంగా మారుతున్నది. జిల్లాలో ఆర్గనైజర్లు పత్తి విత్తనాల అవకతవకలు చేస్తున్నారని, దీంతో రైతులు, సీడ్ కంపెనీలు నష్టపోతున్నాయన్న విషయాన్ని నమస్తే తెలంగాణ వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో సీడ్ కంపెనీ నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు స్పందించి సీడ్ పత్తి విత్తనాల అవకతవకలపై ప్రత్యేక దృష్టి సారించారు. కంపెనీల నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కొంతమందిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అయితే ఈ క్రమంలో కొంతమంది సీడ్ ఆర్గనైజర్లు తాము ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదంటూ హైకోర్టును అశ్రయించి పిటిషన్లు దాఖలు వేసినట్లు సమాచారం. హైకోర్టు సీడ్ ఆర్గనైజర్ పిటిషన్‌తోపాటు కంపెనీ నిర్వాహకుల పిటిషన్ పరిగణలోకి తీసుకొని రెండు పిటిషన్‌లపై ఆరా తీసినట్లు తెలిసింది. సీడ్ ఆర్గనైజర్‌ల పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరిస్తూ సీడ్ పత్తి విత్తనాల వ్యవహారంలో సమగ్ర విచారణ నిర్వహించాలని పోలీస్ అధికారులతో పాటు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. హైకోర్టు ఆదేశాలతో పోలీస్ అధికారులు అప్రమత్తమై సీడ్ పత్తి విత్తనాల అవకతవకలపై లోతుగా విచారణ చేపట్టారు. ఈ వ్యవహారం నడుస్తున్న క్రమంలో కొంతమంది ఆర్గనైజర్లు తమ పలుకుబడిని ఉపయోగించుకొని వ్యవహారం సద్దుమణిగేలా చేస్తున్నట్లు అరోపణలు వినబడుతున్నాయి.

విచారణ జరుగుతున్నది

సీడ్ పత్తి విత్తనాల అవకతవకలపై సీడ్ కంపెనీల నిర్వాహకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. కేసు నమోదు చేసిన ఆర్గనైజర్ల వద్ద నుంచి ఎంత మంది రైతులు సీడ్ పత్తి సాగు చేశారో వివరాలు సేకరించి ఆరా తీస్తున్నాం.. త్వరలో పూర్తి స్థాయి విషయాలను సేకరించి అవకతకతలు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం.

- సత్యనారాయణ, డీఎస్పీ

21నుంచి భూలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

- 22న స్వామివారి కల్యాణోత్సవం
- 24న రథోత్సవం

గద్వాలటౌన్, ఫిబ్రవరి 18 : గద్వాల కోటలోని భూలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ విచారణకర్త ప్రభాకర్ వెల్లడించారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్, ఆహ్వాన పత్రికలను ఆదివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులైన 1008 సుభుదేంద్రతీర్థ శ్రీపాదుల వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 21న మూలవిరాట్‌కు నిత్య విశేష ఫల పంచామృత అభిషేకంతోపాటు విశేష పుష్పాలంకరణ, పుణ్యహవాచనం, సాయంత్రం ధ్వజారోహణం, అనంతరం స్వామి వారిని హన్మత్ వాహనంపై ఊరేగిస్తారని తెలిపారు. 22వ తేదీన భూలక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం, అనంతరం గరుడవాహనంపై ఊరేగింపు ఉంటుందన్నారు. 23న స్వామివారికి శేష వాహన సేవ, లింగంబావిలో తెప్పోత్సవం ఉంటుందన్నారు. 24న స్వామి వారి మహారథోత్సవం ఉంటుందని తెలిపారు. 25న నిత్య పూజ ఉంటుందన్నారు. 26న రాఘవేంద్రస్వామి మఠం వరకు చెన్నకేశవ స్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపు ఉంటుందన్నారు. 27న సత్యనారాయణస్వామి వ్రతం, స్వామి ఉత్సవమూర్తులను అశ్వవాహనంపై పెద్ద అగ్రహారంలోని అహోబిళం మఠం వరకు ఊరేగిస్తారని తెలిపారు. రాత్రి పది గంటలకు నాగవల్లి దేవతా విసర్జన సర్వ సమర్పణోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. అలాగే 26 వతేదీ రాఘవేంద్రస్వామి వారి 16వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక రాఘవేంద్ర స్వామి మఠంలో రాఘవేంద్రస్వామి అష్టాక్షరి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, మాజీ మంత్రి డీకే సమరసింహరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ నరహరి జోషి, అర్చకులు రాఘవేంద్ర, రఘు, ధనుంజయచారి, పాంచజన్యలు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న అర్చకులు

ఆభరణాలు, నగదు అపహరణ

గోపాల్‌పేట, ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారు, వెండి ఆభరణాలు, నగదు రూ.లక్ష అపహరించారు. ఎస్సై హరిప్రసాద్ కథనం మేరకు...మండలకేంద్రానికి చెందిన భారతమ్మ ఈనెల 16న ఇంటికి తాళం వేసి డెంటల్ చెకప్ కోసం మహబూబ్‌నగర్ దవాఖానకు వెళ్లింది. ఇది అదునుగా చూసిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి ఇంట్లో దాచి ఉన్న 10తులాల బంగారం, 100తులాల వెండి ఆభరణాలు, రూ.లక్ష నగదును అపహరించుకెళ్లారు. ఆదివారం ఇంటికి వచ్చిన ఆమెకు తాళం పగుల గొట్టడం కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బంగారు, వెండి ఆభరణాలు, నగదు కనిపించకుండా పోయాయి. దీనితో ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్లూ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పట్టణ సమస్యలపై ప్రత్యేక దృష్టి

అమరచింత, ఫిబ్రవరి 18: పట్టణ ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ నూర్‌అహ్మద్ అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో చేపట్టనున్న అభివృద్ధి పనులు, బడ్జెట్ నివేదికను తయారు చేసేందుకు పాలకవర్గ సభ్యులతో మంగళవారం చైర్‌పర్సన్ మంగమ్మ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ తేజస్ నందన్‌లాల్‌పవర్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వస్తున్నారన్నారు. పాలకవర్గ సభ్యులు విధిగా హాజరుకావాలని ఆయన తెలిపారు.

బాధితుడికి ఆర్థికసాయం

కొత్తకోట, ఫిబ్రవరి 18 : పట్టణంలోని దేవి టాకీస్ సమీపంలో శనివారం రాత్రి సిలిండర్ పేలి గట్టుయాదవ్ అనే వ్యక్తికి చెందిన గుడిసె దగ్ధమైంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు 25 కిలోల బియ్యం, పదివేల ఆర్థిక సాయాన్ని ఆ పార్టీ నేతలు అందజేశారు. అలాగే శివ స్వాములు బాధిత కుటుంబానికి రూ10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రావుల జితేందర్‌రెడ్డి, ప్రశాంత్, కృష్ణారెడ్డి, మేస్త్రీ శ్రీను, గొల్లబాబు, నరేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనూజీ పాల్గొన్నారు.

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం

అయిజ, ఫిబ్రవరి 18: ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని పిరమిడ్ స్పిరిచ్‌వల్ సొసైటీ మూమెంట్ మాస్టర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అక్షర ఉన్నత పాఠశాలలో ధ్యానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ధ్యా నం చేయడంతో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. నిత్యం ధ్యానం చేయడంతో శారీరక అలసట తీరుతుందన్నారు. శారీరక శ్ర మ, ఒత్తిళ్లతో అలసిపోయే మనసుకు ధ్యానం ఉపశమనం కలిగిస్తుందన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ధ్యానం అలవర్చుకోవాలన్నారు. మనిషికి ఏకాగ్రత ఏర్పడాలంటే ధ్యానం దోహదం చేస్తుందన్నారు. ఎలాంటి ఒత్తిళ్లనైనా జయించవచ్చన్నారు. అనేక రకాల వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు.

ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ఉపేంద్ర

వైద్య శిబిరం విజయవంతం

కొత్తకోట, ఫిబ్రవరి18 : మండలంలోని అమడబాకుల గ్రామంలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ ప్రారంభించారు. 200మందికి కంటి పరీక్షలు నిర్వహించి వంద మందికి ఉచితంగా అద్దాలను పంపిణీ చేశారు. మరో 50 మందికి ఈ నెల 22న కంటి ఆపరేషన్ చేయనున్నట్లు వైద్యాధికారి శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో సత్యారెడ్డి, రాంరెడ్డి, రంగారెడ్డి, మన్యం, లక్ష్మణ్, రామస్వామి, వెంకటయ్య, శ్రీను, తిరుపతయ్య, కొల్లంపల్లి పాల్గొన్నారు.

శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

వీపనగండ్ల, ఫిబ్రవరి18 : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని.. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పనిచేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీపీఎం పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల మధ్య ఆర్థిక వ్యత్యాసం పెంచడం, మతాల మధ్య చిచ్చు పెట్టడం, కుల వ్యవస్థ అసమానతలను కొనసాగించే విధంగా మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తూ అశాస్త్రీయమైన పరిపాలన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, ఆశన్న, ఈశ్వర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్

కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రదానం

బెల్టులను పొందిన విద్యార్థులు

కొత్తకోట, ఫిబ్రవరి 18 : పట్టణంలోని పాత జూనియర్ కళాశాల ఆవరణలో గాడ్స్ ఆన్ వారియర్స్ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు ఆదివారం బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌కే నబీ మాట్లాడుతూ కరాటే ఆత్మరక్షణకు ఆరోగ్యానికి ఎంతో అవసరమని, కరాటే పోటీలకు అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యత లభించిందన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నేతలతో విద్యార్థులకు సర్టిఫికెట్లు, బెల్టులను అందజేశారు. కార్యక్రమంలో గొల్ల బాబు, భరత్‌భూషణ్, ఖాజామైనుద్దీన్, మిషేక్, నరేందర్‌రెడ్డి, బోయేజ్, లతీఫ్, సాజద్‌అలీ, మాస్టర్లు జహీర్, జాఫర్, సాధిక్, హరీశ్‌యాదవ్, జహంగీర్ పాల్గొన్నారు.

మరుగుదొడ్లకు మోక్షమెప్పుడో!

- ఇబ్బందులెదుర్కొంటున్న

మూత్రశాలల నిర్మాణానికి భూమిపూజ చేసి వదిలేసిన స్థలం

మహిళలు, విద్యార్థినులు

చిన్నంబావి, ఫిబ్రవరి 18 : మండల కేంద్రానికి నిత్యం 17గ్రామ పంచాయతీల ప్రజలు సొంత పనులకు వస్తూ పోతుంటారు. తాసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్ తదితర కార్యాలయాలు, వ్యాపారాల నిమిత్తం నిత్యం వస్తుంటారు. గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు వెంటనే పనులు కాకపోవడంతో మహిళలు, విద్యార్థులు తమ కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ప్రజాప్రతినిధులు మహిళలను దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంలో సామూహిక మూత్రశాలల నిర్మాణానికి భూమిపూజ చేసి వదిలేశారు. ఇప్పటి వరకు పనులు పూర్తిచేయలేదు. దీంతో నిత్యం రద్దీగా ఉంటే ప్రదేశాలల్లో కాలకృత్యాలు తీర్చుకునేందుకు మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూమిపూజ చేసిన నాటి నుంచి ప్రజలు మూత్రశాలలు పూర్తయితే సమస్యలు తొలుగుతాయని ఎంతో ఆనందంగా ఉన్నారు. కానీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు నిరాశకు గురవుతున్నారు. మహిళలకు ఇబ్బందులు కలుగకుండా మూత్రశాలల నిర్మాణం చేపట్టాలని ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ప్రయాణికులు, మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

మండలకేంద్రం ఏర్పడినప్పటి నుంచి మూత్రశాలల నిర్మాణంపై ఏ అధికారి కూడా పరిశీలించలేదు. నిర్మాణంపై చర్యలు తీసుకోలేదు. మండలకేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నా విధులకు వస్తున్నామా వెళ్తున్నామా అన్నట్టుగా వ్యవహరిస్తున్నారే తప్పా మూత్రశాలల నిర్మాణంపై కన్నెత్తికూడా చూడడం లేదు. మూత్రశాలల నిర్మాణంపై అధికారులు చొరవ తీసుకొని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందుల తొలగించేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాలకృత్యాలకు ఇబ్బందులు

మండలకేంద్రానికి ఎంతో మంది మహిళలు, విద్యార్థినులు వస్తూ పోతుంటారు. మాకు లేడీ స్ కార్నర్ షాపు ఉంది. కానీ కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా పనుల నిమిత్తం వచ్చే గ్రామాల ప్రజల పనులు త్వరగా పూర్తికాకపోవడంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మూత్రశాలలు నిర్మించేందుకు భూమిపూజ చేసి వదిలేశారు. ఇప్పటికైనా అదికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మూత్రశాలలు త్వరితగతిన నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలి.

- కవితారెడ్డి, లేడీస్ కార్నర్ యజమాని, చిన్నంబావి

అంతర్రాష్ట్ర మహిళల బాస్కెట్‌బాల్ టోర్నీ విజేత అత్మాక్స్

అయిజ, ఫిబ్రవరి 18 : అంతర్రాష్ట్ర బాస్కెట్‌బాల్ టోర్నీ మహిళల విభాగం విజేతగా అత్మాక్స్ జట్టు నిలిచింది. ఉత్తనూర్ గ్రామంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆదివారం జరిగిన మహిళల ఫైనల్ పోటీలో అత్మాక్స్, డాన్ బాస్కో జట్లు తలపడ్డాయి. హోరా హోరీగా జరిగిన మ్యాచ్‌లో 48-37తో అత్మాక్స్ జట్టు గెలుపొందినట్లు టోర్నీ కార్యదర్శి నీలిమ, తెలంగాణ బాస్కెట్ బాల్ సీనియర్ కోచ్ నయీముద్దీన్ తెలిపారు. పురుషుల విభాగం బాస్కెట్‌బాల్ ఫైనల్ పోటీలో ఇన్‌కంట్యాక్స్, డీబీఏ జట్లు తలపడగా, 92-72 స్కోరుతో ఇన్‌కంట్యాక్స్ మొదటి స్థానంలో నిలిచింది. 76 స్కోర్‌తో మూడో స్థానంలో కస్టమ్స్, 65 స్కోర్‌తో నాల్గో స్థానంలో చిత్తూరు జట్టు గెలుపొందింది. గెలుపొందిన జట్లకు ప్రజా ప్రతినిధులు, దేవస్థాన కమిటీ సభ్యులు నగదు, ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, దేవస్థాన కమిటీ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సందెరాళ్లు, గుబ్బలగుండు పోటీలు

అంతర్రాష్ట్ర సందెరాళ్లు, గుబ్బల గుండు, దొబ్బుడుగుండు, ఇసుక సంచులు ఎత్తు పోటీల్లో భీములు తమ బలాన్ని ప్రదర్శించారు. మండలంలోని ఉత్తనూర్ ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన అంతర్రాష్ట్ర పోటీలకు తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన బల భీములు తమ ప్రదర్శన చూపగా విజేతలను దేవస్థాన కమిటీ ప్రకటించింది. దొబ్బుడుగుండు ఎత్తు పోటీలో అయిజ మండలం, వెంకటాపురానికి చెందిన లాల్‌బాషా 160 కేజీల బరువు ఎత్తి మొదటి స్థానంలో నిలువగా, రాజోళి మండలం, పచ్చర్ల గ్రామానికి చెందిన ఉపేంద్ర 130కేజీల బరువు ఎత్తి రెండోస్థానంలో నిలిచాడు. గుబ్బల గుండు ఎత్తు పోటీలో వడ్డేపల్లి మండలం, జూలకల్ గ్రామానికి చెందిన రంగస్వామి 125 కేజీల బరువు ఎత్తి మొదటి స్థానంలో నిలువగా, రాజోళి మండలం, పచ్చర్ల గ్రామానికి చెందిన షాకీర్ 123 కేజీల బరువు ఎత్తి రెండోస్థానంలో నిలిచాడు. సందెరాళ్లు ఎత్తు పోటీలో గట్టు మండలం, మిట్టదొడ్డికి చెందిన ఉరుకుందు 102 కేజీల బరువు ఎత్తి మొదటిస్థానంలో నిలువగా, గట్టు మండలం, బల్గెరకు చెందిన హన్మంతు 100 కేజీల బరువు ఎత్తి రెండోస్థానంలో నిలిచాడు. ఇసుక సంచి ఎత్తు పోటీలో రాయిచూర్ జిల్లా, దేవదుర్గకు చెందిన పరశురాంనాయక్ 190 కేజీల బరువు ఎత్తి మొదటిస్థానంలో నిలువగా, కర్ణాటక రాష్ట్రం యాద్గీర్ జిల్లా, సాపూర్ తాలూకా, శారదపల్లికి చెందిన మరియప్పానాయక్ 170 కేజీల బరువు ఎత్తి రెండోస్థానంతో సరిపెట్టుకున్నాడు. అనంతరం విజేతలకు దేవస్థాన కమిటీ నగదు, మెమెంటోలను అందజేసింది.

సందెరాయి ఎత్తిన బల భీముడు

మహిళల విజేతలతో ప్రజాప్రతినిధులు, దేవస్థాన కమిటీ సభ్యులు, కోచ్‌లు

ముగిసిన పశుబల ప్రదర్శన పోటీలు

అయిజ, ఫిబ్రవరి 18 : రైతుల సంతోషం కోసమే రైతు సంబురాలను నిర్వహిస్తున్నట్లు పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు వెంకట్ రెడ్డి అన్నారు. మండలంలోని ఉత్తనూర్‌లో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న సీనియర్ పశుబల ప్రదర్శన పోటీలను ఆదివారం పాణ్యం మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం బండలాగుడు పోటీల్లో గెలుపొందిన విజేతలు, 2022-23 ఏడాదిలో టెన్త్ టాపర్లకు నగదు, మెమెంటోలను అందజేశారు.